
ఏలూరులో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న రైతులు


కారుమానిపల్లిలో నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్వర్లు


కురిచేడు: గంగదొనకొండ శివాలయంలో పడిపోయిన చెట్టు


బేస్తవారిపేట: పాపాయిపల్లె పొలంలో నేలకొరిగిన వరిపంట


కురిచేడు: దొనకొండ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగిస్తున్న సిబ్బంది


బొడిచర్ల వద్ద గుండ్లకమ్మ కాలువను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ షెహ్బాజ్ అహ్మద్, సీఐ భీమానాయక్

ఎడతెరపి లేని వాన

- మిచాంగ్ తుఫాన్ ధాటికి స్తంభించిన జనజీవనం
- కొందరు రైతులకు మోదం.. ఇంకొందరికి ఖేదం
- క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా వేగంగా చర్యలు

మార్కాపురం: మిచాంగ్ తుఫాన్ కారణంగా మార్కాపురం ప్రాంతంలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకూ ఎడతెరపిలేని వానకురవడంతో జనజీవనం స్తంభించింది. మార్కాపురంలో 3.8 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఆర్టీసీ డిపో, సబ్‌కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో భారీగా వర్షం నీరు నిలిచింది. ఈదురుగాలులకు మార్కాపురం మండలంలోని శివరాంపురం గ్రామంలో విద్యుత్ స్తంభాలు పడిపోగా ఏడీఈ షియానాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేశారు. మార్కాపురం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచినా అధికారులు ఎప్పటికప్పుడు పునరుద్ధరించారు. వేములకోటలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో ఆ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. కాగా ఈ వర్షం మిర్చి, పొగాకు, కంది పంటలకు ఉపయోగకరమని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం టౌన్: తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ షెహ్బాజ్ అహ్మద్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి చెరువులు, కాలువలను పరిశీలించారు. బొడిచర్ల వద్ద పారుతున్న కాలువను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఆయన వెంట మార్కాపురం సీఐ భీమానాయక్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ ఉన్నారు.

మిరప, వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోండి

మార్కాపురం రూరల్: మండలంలోని రామచంద్రాపురం, కొండేపల్లి గ్రామాల్లో పొలాలను ఏడీఏ రమాదేవి మంగళవారం పరిశీలించారు. పొలాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరితే వేరుకుళ్లు ఆశించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వరిలో నీటిని తొలగించి పిలకదశలో ఉన్నా లేదా ఆలస్యంగా వేసినా ఎకరాకు 20 కిలోల యూరియా వేసుకోవాలని చెప్పారు. వరికుప్పలు వేసుకున్నట్లయితే ఎకరా కుప్పకు 200 కేజీల ఉప్పును చల్లితే గింజలు మొలకెత్తకుండా ఉంటాయని తెలిపారు.

నేలకొరిగిన పంటలు

తర్లుపాడు: మిచాంగ్ తుఫాను కారణంగా మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొందరు రైతులకు సంతోషం కలిగిస్తుంటే మరికొందరికి ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా కంది, మినుము, పెసర, అలసంద లాంటి పంటలకు వర్షం మేలుచేస్తే, వరి, మిర్చి లాంటి పంటలకు నష్టం చేస్తున్నాయి. కారుమానుపల్లి, మీర్జపేట, సీతనాగులవరంతోపాటు పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. తర్లుపాడు, బోబాయపల్లి మంగళకుంట, చెన్నారెడ్డిపల్లి, తాడివారిపల్లి, పోతలపాడు, గానుగపెంటలో మిర్చి నేలవాలింది. పంటలను వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

పొదిలిరూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పొదిలి మండలంలో సోమవారం 27 మి.మీ, మంగళవారం 58.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఏలూరులో వరి పైరు నేలకొరిగింది. ఈదురు గాలులకు కంది పూత రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ధాటికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదిలి: మిచాంగ్ తుఫాను కారణంగా పొదిలి ఆర్టీసీ బస్టాండ్, నవాబ్‌మిట్ట, పీఎన్‌ఆర్ కాలనీ, మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో చెట్లు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం సాయంత్రం వరకు సరఫరా నిలిచింది. ఆంజనేయస్వామి గుడి, పెద్ద మసీదు, మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో, ఆంధ్రాబ్యాంకు వీధి, నేతపాలెం తదితర చోట్ల రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. తహసీల్దార్ కార్యాలయంలోనూ చెట్టు నేలకొరిగింది

బేస్తవారిపేట: తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం కురవడంతో ప్రజలు బయటకు రాలేక ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. సోమవారిపేటలో ఈదురు గాలులకు అరటి తోటల్లో చెట్లు విరిగిపోయాయి. మిరప పంటల్లో పూత, కాయలు రాలిపోవడం, రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు పొలంలో నీరు నిలవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూసలపాడులో కాపుతో ఉన్న మిరప చెట్లు గాలులకు వేర్లతో పెకిలించడం, వర్షం నీరు పొలంలో నిల్వ ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గిద్దలూరు రూరల్: తుఫాన్ కారణంగా మండలంలో మంగళవారం వేకువ జామున నుంచే ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలోని సగిలేరు వాగు వద్ద నివాసం ఉండే స్థానికులు మాత్రం ఎక్కడ తమ నివాస గృహాలు ముంపుకు గురవుతాయోనని భయం భయంగా గడిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కురుస్తున్న వర్షపాతం వివరాలు గిద్దలూరులో 32.4 మి.మీటర్లు, అర్ధవీడు 26.2, రాచర్ల 32.4, కొమరోలు 41.2, బేస్తవారిపేట 27.2, కంభం 21.8 మిల్లీమీటర్లుగా నమోదైంది.

పుల్లలచెరువు: తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ దాసు హెచ్చరించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అవసరమైతేనే రావాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మట్టి మిద్దెల్లో ఉన్న వారు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రి వేళ మట్టి మిద్దెల్లో ఉండవద్దని, వేరే చోట బస చేయాలన్నారు. తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో ఎవైనా నష్టాలు జరిగితే వెంటనే కార్యాలయంలో తెలియజేయాలన్నారు. వీఆర్వోలు కూడా గ్రామాల్లోనే ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. పుల్లలచెరువులో 65 మిమీ వర్షపాతం నమోదైందని తహశీల్దార్ చెప్పారు.

దర్శి: మండలంలో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా తుఫాను ప్రభావంతో వర్షం కురుస్తూనే ఉంది. పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. అద్దంకి రోడ్డు కాటేటు వాగు పొంగిపోవడంతో రాకపోకలు అంతరాయం లేకుండా పొక్లెయిన్ పెట్టి పూడికలు తీసి నీరు వెళ్లేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. రాజంపల్లి సమీపంలో చెట్లు పడిపోవడంతో వాటిని తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించేందుకు ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి దగ్గరుండి చెట్లు తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. సోమవారం రాత్రి నుంచి విద్యుత్ లేకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో వరి కంకి దశలో ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కోత దశకు వస్తే వరి మొత్తం తడిసి భారీగా నష్టపోవాల్సి వచ్చి ఉండేది. మెట్టపైర్లయిన పత్తి పొగాకు, కందికి మాత్రం ఎటువంటి ఇబ్బందులు జరగలేదు. మిరప పంటకు మాత్రం పూత కాయ ఉన్న మొక్కలకు కొంత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

ముండ్లమూరు: తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. తుఫాన్ ధాటికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడ్డారు. ఈదురు గాలులు, ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. మండలంలోని పెద రావిపాడు- తమ్మలూరు గ్రామాల మధ్యలో సోమవారం అర్ధరాత్రి 11కేవీ విద్యుత్ స్తంభాలు ఏడు నేలకొరగడంతో ఉమామహేశ్వరపురం, ఈదర విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో 20 గ్రామాలకు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో పెద ఉల్లగల్లు, రెడ్డినగర్ గ్రామాల వద్ద రోడ్డుపైన భారీ చెట్టు విరిగి పడటంతో ఆ మార్గంలో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎస్ఐ కృష్ణయ్య తన సిబ్బందితో రోడ్డుపైకి వచ్చి జేసీబీ సాయంతో రోడ్డుపై విరిగి పడిన చెట్లను తొలగించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. మండలంలోని రాజాగోపాలరెడ్డి నగర్‌లో సోమవారం అర్ధరాత్రి సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు పడడంతో 8 స్తంభాల వరకు నేలకు ఒరిగాయి. ఆ సమయంలో గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి చెప్పడంతో విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తూర్పుకంభంపాడులో మంగళవారం సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌పైన చెట్టు పడటంతో 6 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఈఈ సయ్యద్ అబ్దుల్ కరీం సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్ఐ కృష్ణయ్య సాయంతో విద్యుత్ లైన్లను క్లియర్ చేశారు. మండలంలోని పసుపుగల్లు, ముండ్లమూరు, చింతలపూడి, ఈదర వాగులు పైకి కొద్దిపాటి నీరు రావడంతో వాహన రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ఉమామహేశ్వరపురం, శంకరాపురం, ఈదర, పూరిమెట్ల గ్రామాల్లో మిరప చేలల్లోకి నీరు భారీగా చేరడంతో నీటిని వెళ్ల బెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు.

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామానికి చెందిన పాశం కొండయ్య, నాలి కొండయ్యల ఇంటి గోడలు పడటంతో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కోత దశలో ఉన్న వరి నేలకొరగడంతో రైతులకు దిక్కు తోచలేదు.

కురిచేడు: తుపాను తాకిడికి మండల ప్రజల జీవనం అతలాకుతలమైంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు నేలను తాకాయి. పంటలు నేలకొరిగిపోయాయి. పొగాకు పందిర్లు పట్టలు లేచిపోయి పొగాకు తడిసి ముద్దయింది. రోడ్లవెంట చెట్లు విరిగి రోడ్లకు అడ్డుపడి రాకపోకలను నిలిపివేశాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు వాటిని క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల కేంద్రం నుంచి దొనకొండ వెళ్లే రహదారి వెంట చెట్లు రోడ్డుకు అడ్డుగా పడటంతో ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, కురిచేడు 2, పడమరనాయుడుపాలెం పంచాయతీ కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, షేక్ మహబూబ్ బాషాలు తమ సిబ్బందితో చెట్లను తొలగించి రాకపోకలకు క్లియర్ చేశారు. పడమరవీరాయపాలెం పంచాయతీ పరిధిలోని స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీ వద్ద డ్రైనేజీ పూడిపోయి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఈఓఆర్డీ ప్రసాదరావు, పడమరవీరాయపాలెం పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహనరెడ్డితో కలిసి జేసీబీతో డ్రైనేజీ పూడిక తీయించి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేయించారు. మండలంలోని గంగదొనకొండ గ్రామంలోని శివాలయంలో పెద్దచెట్టు గాలికి పడటంతో విద్యుత్ తీగలు తెగి స్తంభాలు నేలకొరిగాయి. ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, గ్రామ కార్యదర్శి, విలేజ్ పోలీసు, ఈఓఆర్డీ ప్రసాదరావుకు సహకరించి చెట్టును జేసీబీతో తొలగించారు. విద్యుత్ స్తంభాలకు సపోర్టు తీగలను విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి సిబ్బందిని పంపించి ఏర్పాటు చేశారు. 20 గంటలు గా మండలంలో విద్యుత్ సరఫరా నిలిచి పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


దర్శి: తాటి వాగులో పూడిక తీయిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లిలో కూలిన మిద్దె

యర్రగొండపాలెం: మండలంలోని మొగుళ్లపల్లిలో మంగళవారం మిద్దె స్లాబ్, ఒక పక్క గోడ పూర్తిగా కూలింది. తుఫాన్ కారణంగా రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి గ్రామంలోని చాట్ల పెద్ద అచ్చయ్యకు చెందిన మిద్దె గోడ బాగా తడిచింది. స్లాబ్ బరువుకు తట్టుకోలేక గోడ కూలటానికి ముందుగా ప్రమాదాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు గమనించి బయటకు వచ్చారు. వెంటనే గోడతోపాటు స్లాబ్ కూలి కింద పడింది. దీంతో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సంఘటన గురించి తెలుసుకున్న తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి వెంటనే ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.3 వేల నగదు, 50 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పంచదార పంపిణీ చేశారు. సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయ కుమార్ పాల్గొన్నారు.

అర్థవీడు (కంభం): తుఫానుతో కలిగే పంట నష్టం, ఆస్తినష్టంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ వెంకట్రావు సూచించారు. స్థానిక కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఎంపీపీ సమావేశమయ్యారు. మండలంలో నిర్వహించనున్న కులగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఓ సాంబశివరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాచర్ల: తుఫాన్ కారణంగా మండలంలో సోమవారం రాత్రి కుండపోత గాలితో కూడిన వర్షం కురిసింది. సోమవారం రాత్రి 8 గంటలకు నుంచి మొదలై రాత్రంతా గాలితో కూడిన భారీ వర్షంగా మారింది. పొగాకు, పత్తి, కంది పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. తీవ్రమైన ఈదురు గాలుల కారణంగా మిరప, పొగాకు, జొన్న పంట పొలాలు పూర్తిగా నేలకొరిగిపోయాయి. తీవ్ర గాలి కారణంగా అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్ పల్నాటి మహబుబ్‌బాషా పొగాకు షెడ్డు పూర్తిగా కూలిపోయింది.


పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు


ముండ్లమూరు: పెదరావిపాడు వద్ద 11కేవీ స్తంభాలను పరిశీలిస్తున్న ఈఈ అబ్దుల్ కరీం


మార్కాపురం : వర్షం కారణంగా నిర్మానుష్యంగా కంభం సెంటర్ రోడ్డు


రాచర్ల: అనుమలవీడులో కూలిన పొగాకు షెడ్డు


వై.పాలెం: మొగుళ్లపల్లెలో కూలిన మిద్దె

పొలాల్లో నిలిచిన వర్షం నీరు


తోకపల్లిలో మిరప పంటలో నిల్వ ఉన్న నీరు


త్రిపురాంతకం: దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


బేస్తవారిపేట: వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


పెద్దారవీడు: రైతులతో మాట్లాతున్న ఏవో

కంభంలో నేలకొరిగిన అరటి, వరి

కంభం: మండలంలో తుఫాన్ ప్రభావంతో ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారు జామున వీచిన గాలులకు కంభం చెరువు ఆయకట్టు కింద సుమారు 50 ఎకరాలకు పైగా అరటి తోటలు నేలకొరిగాయి. సుమారు 150 ఎకరాల్లో వరిపైరు నేలకొరిగింది. ఇంతటితో తుఫాన్ ప్రభావం ఆగిపోతే ఇబ్బంది లేదని లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి పట్టణంలోని పార్కువీధిలోని సయ్యద్ సత్తార్‌కు చెందిన మట్టి మిద్దె కూలి ఇంట్లో ఉన్న సామాన్లు ధ్వంసమై సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

త్రిపురాంతకం: తుఫాన్ కారణంగా వరి పట ప్రధానంగా దెబ్బతింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. నష్టపోయిన పంటలు, రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వ్యవసాయాధికారి కె.నీరజ తెలిపారు. మండలంలో వరిపంట కోత దశలో కొంత, మరి కొంత పొట్టదశలో ఉంది. పైరు చేతికొస్తుందనుకుంటున్న సమయంలో తుఫాన్ పంటలను దెబ్బతీసింది. వెల్లంపల్లి, గొల్లపల్లి, విశ్వనాథపురం తదితర గ్రామాల్లో ఎక్కువగా వరి పంటను రైతులు సాగు చేశారు. వేసిన వరిపంట తుఫాన్ కారణంగా వీచిన ఈదురు గాలులు, వర్షానికి ఎక్కువగా నెలకొరిగింది. సుమారు 2500 ఎకరాల్లో సాగుచేస్తున్న వరిపంట నేలకొరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంట నష్టాలను పరిశీలించి నివేదికలను తయారు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దారవీడు: తుఫాన్ ప్రభావంతో మండలంలో వాతావరణం మార్పులు చోటు చేసుకోవడంతో సోమవారం నుంచి వర్షం జల్లులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పంటలు నీటిలో మునిగాయి. చేతికొచ్చిన పత్తి, మిరప, జొన్న, పొగాగు, మినుము, కూరగాయలు, తదితర పంటల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో పాటు ఈదురు గాలులు వీయడంతో నేలకు ఒరిగి పోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా తుఫాన్ ప్రభావం కొనసాగితే పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బేస్తవారిపేట: తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంటలో గింజ మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సోమవారిపేట, చింతలపాలెం గ్రామాల్లో ఆయన పంటలను పరిశీలించారు. పొలంలో పడిపోయిన వరి పైరును కట్టలు కట్టడం, పొలంలో చిన్న నీటి కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన పంటల వివరాలను జిల్లా అధికారులకు తెలిపినట్లు ఏఓ జక్కం మెర్సీ తెలిపారు. సాంకేతిక వ్యవసాయశాఖాధికారి మహబూబ్‌బాషా, వీఏఏలు ఆర్ సుజాత, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్దారవీడు: పంటల్లో వర్షం నీటిని నిల్వ లేకుండా బయటకు వెంటనే పంపిచేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి బుజ్జిబాయి సూచించారు. మండల పరిధిలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. వర్షం నీటిని బయటకు వెళ్లే విధంగా పొలాల గట్లకు ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు పెట్టుకుంటే నీరు సులభంగా బయటకు పోతాయన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తి, మిరపకు విల్ట్ తెగులు సోకకుండా బ్లెటైాక్స్ , మ్యాన్‌కోజెట్ డ్రైవింగ్ విధానం, కేఎస్ఏటి3 పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలన్నారు.

కారు-బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: కారు-బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని లింగాపురం వద్ద మంగళవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. పోరుమామిళ్ల నుంచి బస్సు గిద్దలూరు వైపుగా వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది.

కారు-బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

గిద్దలూరు రూరల్: కారు-బైక్ ఢీకొని ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొత్తపల్లె సమీపంలో మంగళవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. ముండ్లపాడు గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే ఆర్మీ ఉద్యోగి గిద్దలూరు నుంచి రాచర్ల వైపుగా వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. ఆంజనేయులు కిందపడి గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

టమోట లోడు వాహనాలు ఢీ

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై టమోట లోడుతో వెళ్తున్న వాహనాలు ఢీకొన్న సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. రాయచోటి నుంచి వినుకొండకు టమోటా లోడుతో బొలెరో వాహనం వెళ్తోంది. గిద్దలూరు నుంచి మార్కాపురం వైపునకు టమోటా లోడుతో వెళ్తున్న అప్పే ఆటోను వెనుక వైపున బొలెరో వాహనం ఢీకొట్టింది. రోడ్డుకు ఎడమ వైపున బొలెరో, కుడి వైపున అప్పే ఆటోలు పల్టీలు కొట్టి పడిపోయాయి. రెండు వాహనాలూ నుజ్జునుజ్జయ్యాయి. వాహనాల్లో ఉన్న టమోటాలు నేలపాలయ్యాయి. అప్పే ఆటో డ్రైవర్ రంగారెడ్డికి కాలు విరగడం, మరో రైతు భాస్కర్ తలకు గాయాలయ్యాయి. బొలెరో వాహనంలోని నరేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను బేస్తవారిపేట 108 సిబ్బంది కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


నేలపాలైన టమోటాలు

9 నుంచి కులగణన సర్వే

మార్కాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం మార్కాపురం ఎంపీడీఓ తోట చందన అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎల్‌డీఓ బీఎస్ సాయికుమార్ హాజరై మాట్లాడుతూ.. మండలంలో డిసెంబర్ 9 నుంచి 19 వరకు కుల గణన సర్వే ప్రారంభమవుతుందని, నూరు శాతం గృహాలను కవర్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. 1931 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి జరుగుతున్న సమగ్ర కుల గణన సర్వేను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. సర్వేలో సేకరించిన డేటాను గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. సమావేశంలో మార్కాపురం తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఏఎస్‌డబ్ల్యుఓ పాల్గొన్నారు.

తర్లుపాడు: ఈ నెల 9 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణనకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆరోగ్య విద్యా ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కుల గణన చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ అబ్దుల్ హమీద్, ఏఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నిర్మల్ బాబు, మురారి వెంకటేశ్వర్లు, అక్బర్ అలీ, దూదేకుల పెద్ద మస్తాన్, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

పెద్దారవీడు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కులగణన గ్రామాల్లో పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్ అదేశించారు. స్థానిక ఎంపీడీఓ కారాలయంలో కులగణన సర్వేపై అధికారుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని, ఈ నెల 9వ తేదీ నుంచి గ్రామాల్లో కుల గణన సర్వే ప్రారంభించాలని తెలిపారు. చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకుండా ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కులగణన సర్వేలో సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు భాగస్వాములు కావాలని చెప్పారు. తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, డీటీ రాజేష్, ఏఓ బుజ్జిబాయి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సాయికుమార్

అయ్యప్ప ఆలయంలో పోలీసుల పూజలు

మార్కాపురం: పట్టణంలోని అయ్యప్పస్వామి గుడిలో మంగళవారం సీఐ భీమానాయక్, పట్టణ ఎస్సై కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోపాల మల్లికార్జునరావు, పరుచూరి కృష్ణయ్య ఆలయ విశేషాలను వివరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న సీఐ భీమానాయక్, ఎస్సై కోటేశ్వరరావు

దర్శిలో విద్యుత్‌కు అంతరాయం

దర్శి: పట్టణంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. మూడు రోజులుగా తుఫాన్ హెచ్చరికలు చేస్తున్నా కరెంటు తీగల దగ్గరలో ఉన్న చెట్లు కొమ్మలు కొట్టకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో వీచిన తుఫాను గాలులకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ పూర్తి స్థాయిలో లేకపోవడంతో తాగునీరు, వాడుక నీరు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.